వామ్మో.. అన్ని రోజులా..!



● పోలింగ్‌కు బహు దూరం
● ప్రచార ఖర్చు తడిచి మోపెడవుతుందనే భయం
● అభ్యర్థుల్లో ఆందోళన
● కొంపమునుగుతుందని వైసీపీలో టెన్షన్

(కడప-ఆంధ్రజ్యోతి) : ఎన్నికల షెడ్యూలు కోసం ఎప్పుడెప్పుడా అంటూ అందరూ ఆసక్తిగా చూశారు. ఎన్నికల షెడ్యూలు వచ్చేసింది. మే 13న పోలింగ్ జరగనుంది. అయితే పోలింగ్‌కు ఇంత లాంగ్ (55 రోజులు) గ్యాప్ రావడం, ఇన్ని రోజులు ప్రచారం చేసుకుంటూ కేడరును మెయింటెనెన్స్ చేయాలంటే ఖర్చు తడిచి మోపెడవుతుందనే ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది. సార్వత్రిక ఎన్నికలు ఈ సారి రసవత్తరంగా సాగనున్నాయి. జగన్‌ను గద్దె దింపేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. బాబు షూరిటీ భవిషత్తు గ్యారంటీ పేరుతో టీడీపీ ఇప్పటికే ఇంటింటి ప్రచారం చేస్తూ వచ్చింది. వైసీపీ కూడా గడప గడపకూ ప్రభుత్వం అంటూ ఇంటింటికీ వెళ్లింది. అయితే ఎన్నికల షెడ్యూలు వచ్చిన తరువాత ప్రచారం ఊపందుకుంటుంది. షెడ్యూలు వెలువడితే.. నెలలోపే అంటే ఏప్రిల్‌లోనే ఎన్నికలు ఉంటాయని అందరూ భావించారు. అయితే నాలుగో విడతలో భాగంగా మే 13న ఎన్నికలు జరగనున్నాయి.

ప్రచార ఖర్చు తడిచి మోపెడవుతుందని..

ఒకప్పుడు రాజకీయ ప్రచారానికి, సమావేశాలకు, సభలకు కూడా జనం స్వచ్ఛందంగా వచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. డబ్బులతో పాటు బిర్యానీ, మగవారికి లిక్కర్ ఇస్తే తప్ప మీటింగ్‌లకు కదలని పరిస్థితి. దీంతో ప్రచారం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ రూ.500 ఇచ్చి పిలుచుకోవాల్సి వస్తోంది. జిల్లాలో ఇప్పటికే టీడీపీ, వైసీపీ వారు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. చాల చోట్ల కూలీ డబ్బులు ఇచ్చి జనాలను ప్రచారానికి తెచ్చుకుంటున్నారు. ఏదైనా డివిజన్, వార్డు, పల్లెలకు వెళ్లినా భారీ జనసమీకరణకు తెర లేపుతున్నారు. దీంతో ప్రచారానికి వచ్చిన మగాళ్లకు రూ.500, మందు ఇవ్వాల్సి వస్తుంది. రోజు కూలీ రూ.500తో పాటు ఉదయం పూట టిఫిన్, స్నాక్స్, ట్రాన్స్‌పోర్టు, టీలు అదనంగా రూ.150 వస్తున్నాయంటున్నారు. మందు లేకుంటేనే ఒక్కొక్కరికి రూ.700 ఖర్చవుతుంది. ఈ లెక్కన ఉదాహరణకు వంద మందితో ప్రచారాన్ని చేపట్టినా రోజుకు రూ.70వేలు అవుతుంది. ఇక పటాకులు, బ్యాండ్లు, పూలదండలు ఇతర హంగామా చేస్తే ఖర్చు లక్షన్నర దాటుతుంది. ఇక భోజనాలు పెడితే ఇంకా జనాలు ఎక్కువైతే రోజూ రూ.5లక్షలకు పైగానే పడుతుంది. వంద మందితో సామాన్యంగా చేస్తేనే రూ.లక్షపైన సాదాసీదాగా ఉంది. దాదాపు పోలింగ్‌కు 50 రోజులు టైం ఉంది. ఈ 50 రోజులు ప్రచారం చేసినా కూడా రోజుకు మరీ తక్కువగా రెండు లక్షల రూపాయలు వేసుకున్నా కూడా కోటి రూపాయలు అవుతుంది. జనాలను బట్టి ఇంకా ఎక్కువ వేసుకుంటే ఈ ఖర్చు పెరుగుతుంది.

వైసీపీలో తీవ్ర ఆందోళన

మాకు జనాదరణ తగ్గలేదని చెప్పుకోవడానికి వైసీపీ నేతలు నానాపాట్లు పడుతున్నారు. మనం ఏం చేయలేదని అభ్యర్థులకు తెలుసు. జనాలలో వ్యతిరేకత ఉందని తెలుసు. అయితే బడాయి కోసం.. ప్రచారంలో జనం మావెంటే ఉన్నారని చెప్పడానికి భారీగా జన సమీకరణ చేస్తున్నారు. వచ్చిన వారికి రూ.500 డబ్బులతో పాటు మగాళ్లకు మందు ఇతర వాటికి ఖర్చు పెడుతున్నారు. ముఖ్యంగా కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో భారీ స్థాయిలో అధికార పార్టీ ఖర్చు చేసి ప్రచారం చేస్తుందంటారు. వైసీపీ పాలనపై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఇది ఆలస్యమయ్యే కొద్దీ అగ్నిలా వ్యాపించి మొత్తాన్ని దహించి వేస్తుందనే భయం ఉంది. అందుకే వీలైనంత త్వరగా షెడ్యూలు రావడంతో పాటు పోలింగ్ త్వరగా జరిగితే బాగుంటుందని భావించారు. పోలింగ్‌కు చాలా గ్యాప్ రావ డంతో ఎన్నికల నిబంధనలు అమల్లో ఉంటాయి. ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే తొలగిస్తామని ఆదేశించింది. దీంతో వలంటీర్ల పైనే ఆధారపడిన వైసీపీ వారికి దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు కోడ్ రావడంతో వలంటీర్లు, ఇతరుల ప్రమేయాన్ని టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు ప్రశ్నిస్తారు. ఇప్పుడు నేరుగా తిరగలేని పరిస్థితి వలంటీర్లపై ఏర్పడింది. ఇప్పటికే తాగునీటి సమస్య మొదలైంది. మైదుకూరులో నీటి సమస్య కోసం రాస్తారోకో చేశారు. చాలా చోట్ల పల్లెల్లో నీటి పథకాలు పనిచేయడం లేదు. ఇక రాను రాను కరెంటు కోతలు విధిస్తారు. ఇవన్నీ అధికార పార్టీకి యాంటీగా మారుతాయని వైసీపీ ఆందోళన చెందుతుంది.

ఆలస్యం కొంప ముంచుతుందని..

మేడిపండు చూడు మేలిమై ఉండు అన్న పరిస్థితి వైసీపీలో తయారైంది. పైకి అంతా బాగా కనిపిస్తున్నా అన్ని చోట్ల విబేధాలున్నాయి. బద్వేలులో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ ఎంపీపీ వరుసకు బామ్మర్ది విశ్వనాధరెడ్డిల మధ్య వార్ సాగుతుంది. ఎంపీ అవినాష్ జోక్యం చేసుకున్నా సయోధ్య కుదరలేదు. గోవిందరెడ్డికి వ్యతిరేకంగా విశ్వనాధరెడ్డి పలు సమావేశాలు నిర్వహించారు. దీన్ని గోవిందరెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఇక ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లుకు వ్యతిరేకంగా శివచంద్రారెడ్డి వర్గం ప్రచారం చేస్తోంది. జమ్మలమడుగులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మధ్య సఖ్యత లేదు. గ్రౌండ్ లెవల్‌లో కూడా ఇరువర్గాల కేడరులో కూడా సఖ్యత లేదంటారు. ఇక కమలాపురంలో ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డిలు పైకి చిరునవ్వుతో కనిపిస్తున్నప్పటికీ ఇద్దరూ కడుపులో కత్తులు పెట్టుకున్నారని అంటారు. ఇక కడపపై డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి, మేయరు సురేష్‌బాబు పెత్తనం ఉంది. సురేష్‌బాబుకు ఎమ్మెల్యే కావాలన్నది కోరిక. ఈ సారి కూడా టికెట్ రాకపోవడంతో ఆయనతో పాటు ఆయన వర్గీయులు కూడా అసంతృప్తితో ఉన్నారు. ఇక మైదుకూరులో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దువ్వూరుకు చెందిన తిరుపాల్‌రెడ్డికి మధ్య గ్యాప్ ఉంది. ఇప్పటికే నియోజకవర్గంలో వర్గపోరు నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల తేదీకి చాలా ఆలస్యం కావడంతో కొంప మునుగుతుందన్న భయం వైసీపీలో ఉంది.



కూటమికి అనుకూలమే..

టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో జనసేనకు రైల్వేకోడూరు కేటయిస్తే బీజేపీకి బద్వేలు, జమ్మలమడుగు కేటాయించారు. కడప పార్లమెంటు పరిధిలో టీడీపీ ఇప్పటికే కడప నుంచి మాధవీరెడ్డి, కమలాపురం పుత్తా చైతన్యరెడ్డి, పులివెందుల బీటెక్ రవి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మైదుకూరు పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ప్రకటించింది. మిత్రపక్షమైన బీజేపీకి బద్వేలు, జమ్మలమడుగు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. టీడీపీ టికెట్ కోసం ప్రొద్దుటూరులో పలువురు ఆశించారు. ఇప్పటిదాకా మహానాడులో చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను టీడీపీ నేత లు ప్రతి ఇంటికి తీసుకెళ్లారు. కూటమి జత కావడంతో కొత్త మేనిఫెస్టోను జనాల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సమయం ఉపయోగపడుతుంది. ఎన్నికల వ్యయం భారమైనప్పటికీ టికెట్లు కోసం ఆశించి భంగపడ్డ వారిని కలుపుకునేందుకు అవకాశం ఉందంటున్నారు. కడప, ప్రొద్దుటూరులో పలువురు టికెట్ కోసం ఆశించారు. వారందరినీ కలుపుకుని పోవచ్చు. అయితే జమ్మలమడుగు, బద్వేలులో టీడీపీ పోటీ చేస్తుందని.. జమ్మలమడుగులో భూపేష్‌రెడ్డి, బద్వేలులో బొజ్జ రోశన్నలు ప్రచారం చేశారు. అయితే ఆ సీట్లు బీజేపీకి కేటాయించారు. పోలింగ్‌కు సమయం ఉండడంతో వీరిని ఎన్నికల నాటికి దగ్గర తీసుకునేందుకు అవకాశం ఉందంటున్నారు. అయితే ఈ ఎన్నికల వ్యయం టీడీపీ, జనసేన, బీజేపీలకు భారం కానుంది.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు



రాజకీయ నేపథ్యం ఉన్న ఫొటోలను తొలగించాలి

● ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి
● రాజకీయ పార్టీలు సహకరించాలి
● జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 17 : సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల నియమావళిని తప్పక పాటించి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్ విజయరామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా ఎన్నికల ప్రధాన అధికారితో పాటు జేసీ గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, ప్రత్యూషలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యతతో కూడినవని, ఎన్నికల అధికారుల పాత్ర ఎంత ఉందో.. రాజకీయ పార్టీల నుంచి కూడా అంతే సహకారం అవసరమన్నారు. రాజకీయ పార్టీల నేపథ్యం ఉన్న వ్యక్తుల ఫొటోలను అన్ని ప్రభుత్వ ప్రైవేట్, పబ్లిక్ ప్రదేశాలలో ఎన్నికల నిబంధనల మేరకు తొలగించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్, సహాయ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తూ, బాధ్యాతాయుతంగా నిర్వహించడం జరుగుతోందన్నారు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ప్రతి కేంద్రంలో రెండు వెబ్ కెమెరాలు, మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. కడప పార్లమెంట్ పరిధిలో 1941 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అదనంగా మరో 22 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో మొత్తం 1963 పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వలంటీర్లకు ఎలాంటి బాధ్యతలు అప్పజెప్పలేదన్నారు. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ పాల్గొంటే వారి వివరాలను సెల్‌ఫోన్‌లో ఫోటోలు, వీడియోలు తీసి పంపితే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రకటనలు తొలగించాలి

● రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

కడప(కలెక్టరేట్), మార్చి 17: సాధారణ ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి ప్రకటనలు, వాల్ పెయింటింగ్స్, పోస్టర్లు, హోర్డింగ్స్, బ్యానర్లు, జెండాలు ఉంటే 24 గంటల వ్యవధిలో తొలగించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం విజయవాడ రాష్ట్ర ఎన్నికల కమిషనరు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలు, రైల్వే, ఆర్టీసీ బస్టాండ్లు, రోడ్లు, వంతెనలు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల ఫొటోలు, రాజకీయ ప్రకటనలకు సంబంధించినవి ఉంటే వెంటనే తొలగించాలన్నారు. వార్తా పత్రికల్లో వచ్చే కథనాలపై 24 గంటల్లో చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, కోర్టు కేసులు ఉంటే నిర్లక్ష్యం చూపరాదన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నివేదికలు ఎప్పటికప్పుడు చేరవేయడానికి యంత్రాగం సిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తామని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారికి వివరించారు.

స్పందన కార్యక్రమాలు తాత్కాలికంగా రద్దు

కడప(కలెక్టరేట్), మార్చి 17 : సాధారణ ఎన్నికలు-2024 సందర్భంగా ఈనెల 18వ తేదీ సోమవారం నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కలెక్టరేట్‌లో జరిగే స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈవిషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీ కోడ్ ఉల్లంఘన

● కుల ఆత్మీయ సమావేశాలు పెట్టి ఓట్లు అడుగుతున్న వైనం
● సభలో చీరలు ఇస్తామని టోకన్లు ఇచ్చారనే ఆరోపణలు
● పట్టించుకోని ఎన్నికల అధికారులు



దూదేకుల ఆత్మీయ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి



దూదేకుల సభలో చీరలిస్తామని చెప్పి టోకన్‌లు చేతిలో పెట్టి వెళ్లిపోయారని ఆరోపిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు, మార్చి 17: దేశంలో సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఆమేరకు ఎన్నికల షెడ్యూలును ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. శనివారం మధ్యాహ్నం నుంచి దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల అధికారులు కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి, కసరత్తు చేస్తూనే వున్నారు. ఈ క్రమంలో ప్రొద్దుటూరులో వైసీపీ నేతలకు తమకు కోడ్ గీడ్ లెక్కలేదని వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ నియమావళిలో ఉన్న కుల, మత పరమైన సమావేశాలు పెట్టి ఓట్ల ప్రచారం చేసుకోరాదని స్పష్టంగా ఉన్నా- అవేమి లెక్కచేయకుండా ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కొర్రపాడు రోడ్డులోని తన సొంత స్థలంలో దూదేకుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎన్నికల అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు (కోడ్ అమలులోకి వచ్చాక) తీసుకోలేదని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. ఆ సమావేశంలో దూదేకుల కులానికి ఎమ్మెల్యే పలు తాయిలాలు ప్రకటించారు. అంతేకాకుండా మున్సిపాలిటీకి చెందిన శ్మశాన స్థలంలో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్సును దూదేకుల సంఘం వారు కట్టుకోవడానికి అనుమతి ఇచ్చారు. ఆ అక్రమణపై చర్యలు తీసుకోకుండా మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులను మేనేజ్ చేశారు. అంతేకాకుండా ఆ కులానికి కల్యాణ మండపానికి తన సొంత నిధులు ఇస్తున్నట్లు తాయిలాలు ప్రకటించారు. ఈసభకు జనం రావడానికి రంజాన్ సందర్భంగా చీరలు ఇస్తున్నట్లు చెప్పి భారీగా మహిళలను తరలించారు. చీరలకు సంబంధించి టోకన్లు ఇచ్చి మీడియా ముందు అవి పంపిణీ చేయకుండా వెళ్లిపోయారు. టోకన్లు ఉన్న వారందరికి చీరలు కచ్చితంగా ఇస్తామని చెప్పి జారుకున్నారు. దీంతో వచ్చిన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నా ఎన్నికల అధికారులు అటువైపు తొంగి చూడలేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వేలాది మందితో సభ పెడితే ఆ కుల ఆత్మీయ సభ జరిగినట్లు తమకు సమాచారం లేదని ఎన్నికల విధుల్లో ఉన్న వారు బాధ్యత తీసుకోవడం లేదు. ఆర్‌వో ఆర్ ఓ కౌసర్‌భాను దృష్టికి తీసుకెళితే తాము ఎటువంటి సభలకు అనుమతులు ఇవ్వలేదని.. మా దృష్టికి రాలేదని.. విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే కమిషనర్ రఘునాధరెడ్డి, డీఎస్పీ మురళీధర్‌ను వివరణ కోరగా... ఆ సమాచారం తమకు లేదన్నారు. ఆ సభకు గతంలో ఏమైనా అనుమతులు తీసుకున్నారేమోనని.. కోడ్ అమలులోకి వచ్చాక ఎటువంటి సభలకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. కోడ్ ఉల్లంఘనలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 17 : జిల్లాలో గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షలు ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా ప్రశాంతంగా జరిగాయని కలెక్టరు విజయరామరాజు తెలిపారు. ఉదయం 61 శాతం, మధ్యాహ్నం 61 శాతం మంది హాజరైనట్లు స్పష్టం చేశారు. ఆదివారం గ్రూప్-1 ఉద్యోగ నియామకం కోసం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 9,754 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం సెషన్స్‌లో 6003 మంది (61.54 శాతం), మధ్యాహ్నం 5972 మంది (61.23శాతం) హాజరయ్యారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా సజావుగా జరిగాయని స్పష్టం చేశారు.



హాల్ టికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

పది పరీక్షలకు గట్టి భద్రత

● సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ● నేటి నుంచి ప్రారంభం ● డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడ ప (ఎడ్యుకేషన్), మార్చి 17: కట్టుదిట్టమైన భద్రత మధ్య పది పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే కంట్రోల్ రూము నెం.9573133385కు తెలపాలని స్పష్టం చేశారు. ఆదివారం కడప డీఈవో కార్యాలయంలో ఎస్ఎస్‌ఏ జిల్లా పర్యవేక్షణ అధికారి క్రిష్టారెడ్డి, డీఈవో అనురాధతో కలిసి డీఆర్వో పరీక్షల నిర్వహణపై విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఈనెల 18 నుంచి 30 వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 153 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షలకు 27858 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రానికి ఉదయం 8.45 గంటల నుంచి విద్యార్థులను అనుమతిస్తారని చెప్పారు. పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటు అధికారులతో పాటు 1320 మంది ఇన్విజిలేటర్లు, 153 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఓపెన్ స్కూలు పరీక్షలు

జిల్లాలో ఓపెన్ స్కూలు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని డీఆర్వో గంగాధర్‌గౌడ్ తెలిపారు. ఈనెల 18 నుంచి 27 వరకు జరిగే ఈ పరీక్షలు మధ్యా హ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించడం జరుగతుందన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి 41 కేంద్రాలు ఏర్పాటు చేశామని.. అందులో 13 కేంద్రాలు పదో తరగతికి, 28 కేంద్రాలు ఇంటర్ పరీక్షలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదో తరగతి కి సంబంధించి 2408 మంది, ఇంటర్ పరీక్షకు 7021 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. 26 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటు అధికారులు ఏర్పాటు చేశా మని.. ఇంటర్‌కు 56 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెటు అధికారులు నియమించామన్నారు. అలాగే ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● పరీక్షల జిల్లా పరిశీలకులు క్రిష్టారెడ్డి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకులు క్రిష్టారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 17: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని పరీక్షల జిల్లా పరిశీలకుడు ఎంవీ క్రిష్టారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఒంటిమిట్ట మండలం జడ్పీ ఉన్నత పాఠశాల, మాధవరం పాఠశాలలో ఎస్ఎస్‌సీ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 581 పాఠశాలల నుంచి 27858 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడుగురు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు ప్రతి సెంటరులో సిట్టింగ్ స్క్వాడ్ నిత్యం పరీక్షలను పర్యవేక్షిస్తూ తనఖీ చేస్తుంటారని, 1311మంది ఇన్విజిలేటర్లు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఎక్కడైనా కాపీలు, మాస్ కాపీయింగ్, మాల్‌ప్రాక్టీసు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్విజిలేటర్లు వారికి కేటాయించిన సెంటర్లకు ఒక గంట ముందే రిపోర్టు చేయాలన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట ఎంఈవో వెంకటసుబ్బయ్య, చీఫ్, డిపార్ట్‌మెంటు అధికారులు పాల్గొన్నారు.

వైసీపీలో బలిజలకు తీరని అన్యాయం

● సమన్యాయం చేశామని జగన్‌రెడ్డి చెప్పడం దుర్మార్గం ● ఎమ్మెల్సీ రామచంద్రయ్య ధ్వజం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 17 : వైసీపీలో బలిజలకు తీరని అన్యాయం జరిగిందని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్‌రెడ్డి తమ అభ్యర్థుల జాబితాలో సమన్యాయం చేశామని చెప్పడం దుర్మార్గమన్నారు. నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అంటే ఇదేనేమో.. జగన్‌రెడ్డి అభ్యర్థుల జాబితా విడుదల చేసిన అనంతరం సామాజిక న్యాయం చేశామని.. దేశ చరిత్రలో సరికొత్తరికార్డులు సృష్టించామని, అన్ని వర్గాలకు సమన్యాయం చేశామని చాటుకోవడం పిల్లి కళ్లు మూ సుకుని పాలు తాగుతూ తనను ఎవరూ చూడలేదని అనుకోవడం లాగే ఉందన్నారు. రాష్ట్రంలో కేవలం 5 శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి 49 సీట్లు కేటాయించి 52 నుంచి 60 శాతం ఉన్న బీసీలకు 48 సీట్లు కేటాయించడాన్ని సామాజిక న్యాయం అంటారా లేక సామాజిక అన్యాయం అంటారా అని ప్రశ్నించారు. ఇక రాయలసీమతో పాటు గ్రేటర్ రాయలసీమలో దాదాపు 20 శాతంగా ఉన్న బలిజ సామాజిక వర్గానికి ఒక్క సీటు కూడా కేటాయించకపోవడాన్ని ఏమనాలన్నారు. 1956లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన నాటినుంచి సాంప్రదాయంగా తిరుపతి, చిత్తూరు, రాజంపేట వంటి స్థానాల్లో బలిజలకు అన్ని పార్టీలు సీట్లు ఇస్తుంటే జగన్‌రెడ్డి వారికి మొండిచేయి చూపడాన్ని సామాజిక న్యాయం అనాలా అని ప్రశ్నించారు. చివరికి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కూడా బలిజలకు సీట్లు ఇవ్వకుండా ద్రోహం చేసిన జగన్‌రెడ్డి బలిజ ద్రోహిగా మిగలిపోతారన్నారు. ఈ అవమానాన్ని బలిజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరని తెలిపారు. అసెంబ్లీతో పాటు పార్లమెంటు సభ్యుల ఎంపికలో కూడా జగన్ సమన్యాయం పాటించలేదన్నారు. రాజంపేట లోక్‌సభకు ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్‌లు బలిజ అభ్యర్థులను నిలబెట్టేవారని, కానీ జగన్ ఆ స్థానాన్ని కూడా సొంత సామాజిక వర్గానికి కట్టిపెట్టుకున్నారన్నారు. ఇలా ఒక ప్రాంతానికి చెందిన బలమైన సామాజిక వర్గాన్ని రాజకీయంగా దూరం చేసుకోవడమంటే తమకు తాము రాజకీయ సమాధి నిర్మించుకోవడమేనన్నారు. ఇప్పటికైనా జగన్ తన పార్టీ అభ్యర్థుల జాబితాలో బలిజలకు స్థానం కల్పించాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు పోటెత్తిన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు

ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు. **- చిలకలూరిపేట**






ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..




జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..

కట్టుకున్నవాడే కడతేర్చాడు..!

● పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 17: కట్టున్న భర్త కాలయముడిగా మారి భార్యను చున్నీతో గొంతు నులిమి చంపి, పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. మండలంలోని సీఐ జీవన్‌గంగనాథబాబు కథనం మేరకు కుర్నూతల పంచాయతీలోని బొమ్మేనపల్లెకు యోగానందరెడ్డి భార్య చనిపోవడంతో పెండ్లిమర్రి మండలం నల్లయ్యగారిపల్లెకు చెందిన రమణమ్మను 8 ఏళ్ల క్రితం ద్వితీయ వివాహం చేసుకున్నాడు. వీరికి ఐదేళ్ల వయసున్న కూతురు ఉంది, వీరు తరచూ గొడవ పడేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారు జామున తన భార్యను చున్నీతో తన భార్య గొంతునులిమి చంపానంటూ పోలీసు స్టేషన్ కు వచ్చి లొంగిపోయాడు.ఎస్ఐ విష్ణువర్ధన్ సిబ్బందితో కలసి సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ (ఇన్‌సర్ట్)రమణమ్మ (ఫైల్)

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

పోరుమామిళ్ల, మార్చి 17 : అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కథనం మేరకు.. పోరుమామిళ్ల మండలం బాలిరెడ్డిపల్లెకు చెందిన బాలకృష్ణ (44) నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. మొక్కజొన్న, సద్ద వంటి పంటలు సాగు చేయగా, ఆశించినంత స్థాయిలో ఫలితం రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. దీంతో శనివారం రాత్రి పొలం వద్ద పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతనిని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.


బాలకృష్ణ మృతదేహం

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రాయచోటిటౌన్, మార్చి 17: పట్టణ పరిధిలోని ఎస్టీ కాలనీలో రెండు రోజుల క్రితం తిరుపతమ్మ అనే మహిళ ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడు తిరుమలేష్‌ను రాయచోటి అర్బన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేయడంతో పాటు, రూ1.7 లక్షలు రికవరీ చేశారు. రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. తన ఇంట్లో రూ.1.7 లక్షల నగదు చోరీకి గురైందంటూ తిరుపతమ్మ రెండు రోజుల క్రితం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐలు భక్తవత్సలం, లోకేశ్‌లు దర్యాప్తు చేసి బాధితురాలి తమ్ముడు తిరుమలేశు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఆదివారం నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో చోరీ కేసును ఛేదించిన ఎస్ఐలు భక్తవత్సలం, లోకేశ్, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్స్ జగన్, బర్కత్ తదితరులను అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ మహబూబ్‌బాషా అభినందించారు.


నిందితుడు తిరుమలేశ్‌తో ఎస్ఐలు భక్తవత్సలం, లోకేశ్

కోదండ రామాలయంలో భక్తులపై తేనెటీగల దాడి

ఒంటిమిట్ట, మార్చి 17: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో ఆదివారం తేనెటీగలు భక్తులపై దాడి చేశాయి. దీంతో దిక్కు తెలియని స్థితిలో ఉద్యోగులు, భక్తులు, సెక్యూరిటీ సిబ్బంది ఎవరికి వారుగా పరుగులు పెట్టడంతో ఏం జరుగుతుందో అని గందరగోళం నెలకొంది. ఈ దాడిలో నలుగురు భక్తులతో పాటు, టీటీడీ తాత్కాలిక సిబ్బంది , మరో అధికారి గాయపడినట్లు స్థానికులు తెలిపారు. గతంలో బ్రహ్మోత్సవాల సమయంలో తేనెటీగలు దాడి చేసిన విషయం తెలిసినా అధికారులు తేనె తుట్టెల తొలగింపునకు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేశారు.

మైదుకూరు వాసికి గేట్‌లో ఆల్ ఇండియా 31వ ర్యాంక్

మైదుకూరు, మార్చి 17 : గేట్ పరీక్షలో మైదుకూరుకు చెందిన గోశెట్టి రామధీరజ్ ఆల్ ఇండియా స్థాయిలో 31వ ర్యాంకు పొందారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఈ ర్యాంకు పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థి తండ్రి గోశెట్టి రామచంద్రారావు 11వ బెటాలియన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు.


రామధీరజ్

రాచమల్లుకు మద్దతిచ్చే ప్రసక్తేలేదు

● వైసీపీ సర్పంచ్ శివచంద్రా రెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 17: వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డికి మద్దతిచ్చే ప్రసక్తే లేదని రాబోయే ఎన్నికల్లో ఆయన ఓటమే లక్ష్యంగా పనిచేస్తానని వైసీపీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రకటించారు. ఆదివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీలో నేనొక్కడినే అసమ్మతివాదినని, అధిష్ఠానం నాతో చర్చించి కలిసి పనిచేయమని ఆదేశించినట్లు రాచమల్లు అవాస్తవాలు చెప్పాడన్నారు. అతనితో కలిసి వెళతానని తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. నా అవసరం లేదు నా ఓట్లు అక్కరలేదని మాట్లాడిన రాచమల్లు మళ్లీ అతనితో కలిసి వస్తా నని అబద్దాలు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. ఎమ్మెల్యేకు వ్యతి రేకంగా వార్డు ఉప ఎన్నిక విషయంలో నా సత్తా ఏమిటో చూపించానన్నారు. సజ్జల, అవినాష్, ధనుంజయరెడ్డి తనను పిలిపించిన మాట వాస్తమేనని.. కానీ, వారితో కూడా రాచమల్లుకు వ్యతిరేకంగా పని చేస్తానని, అతనికి ప్రజల్లో అవినీతి పరుడు, దుర్మార్గుడుగా చెడ్డపేరుందని తెలి పానన్నారు. అసమ్మతి లేదని రాచమల్లు చెపుతున్న మాట వాస్తవం కాదన్నారు. ఆయన వెనక వుండే అతని ఓటమిని కోరు కుంటున్న వారు ఉన్నారన్నారు. త్వరలోనే అసమ్మతి వాదులంతా బయటికి వస్తారన్నారు. వైఎస్ కుటుంబంతో 30 ఏళ్ళ అనుబంధం తనదన్నారు. రాచమల్లు ఘోరంగా ఓడిపోతాడని జగన్‌కు చెప్పినా టికెట్టు ఇచ్చాడన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా రాచమల్లుతో కలిసే ప్రసక్తే లేదని.. అతని ఓటమే తమ లక్ష్యమన్నారు. త్వరలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి తన భవిష్యత్తును నిర్ణయించుకుంటానన్నారు.


మాట్లాడుతున్న వైసీపీ సర్పంచ్ శివచంద్రారెడ్డి

కేజీబీవీలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 17 : ప్రాజెక్టు పరిధిలో ఉన్న కేజీబీవీ పాఠశాలలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకరావాని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రానికి 90 కేజీబీవీ పాఠశాలలు మంజూరు కాగా, వీటి నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుని సిబ్బందిని కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. కేజీబీవీ ప్రారంభమైనప్పటి నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు ఇందులో విధులు నిర్వహిస్తున్నారని, అయితే ఇతర శాఖల ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వీరికి సౌకర్యాలు లభించడంలేదన్నారు. ఇటీవల మోడల్ స్కూలు ఉపాధ్యాయుల సర్వీసును పరిగణించి ప్రభుత్వ సర్వీసు నిబంధనలు అమలు చేసిన విధంగా కేజీబీవీ సిబ్బందికి అమలు చేయాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

కాశినాయన, మార్చి 17: కాషాయ వస్త్రాలు ధరించిన ఓ వృద్ధుడు శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి అన్నమయ్య జిల్లా రామాపురం మండలం సుద్దమల గ్రామానికి చెందిన ఉమ్మడిశెట్టి రామదాసు (65)అనే వృద్ధుడు కొంతకాలంగా జ్యోతి క్షేత్రంలో ఉంటున్నాడు. అనారోగ్యంతో ఉన్న ఈయన అప్పుడప్పుడు నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేవాడు. అప్పుడప్పుడూ మద్యం దుకాణానికి వస్తూ పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇందులో భాగంగా శనివారం నర్సాపురం వచ్చిన రామదాసు రాత్రికి బాలరాజుపల్లె దారిలోని అంకాలమ్మ అరుగుపై పడుకొని అక్కడే చనిపోయి కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోరుమామిళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, బెంగుళూరులో ఉన్న అతని కుటుంబ సభ్యు లకు సమాచారం ఇచ్చినట్లు తెలి సింది. మృతుడి పొట్టపై రక్తగాయం ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై కాశినాయన మండల ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డిని వివరణ కోరగా, అనారో గ్యంతో ఉన్న రామదా సు కడుపునొప్పి తాళలేక మద్యం మత్తులో కత్తితో పొట్టపై గాయపరుచుకొని చనిపోయాడన్నారు.


రామదాసు మృతదేహం

యువకుడిపై వైసీపీ నేత దాడి.. నిర్బంధం

ప్రొద్దుటూరు , మార్చి 17 : అప్పుగా తీసుకున్న మొత్తానికి వడ్డీ చెల్లించలేదంటూ వైసీపీ నేత, అతని తల్లి తనను నిర్బంధించి దాడి చేశారని సృజన్ కుమార్ అనే యువకుడు ఆరోపించాడు. ఆదివారం ఉదయం రామేశ్వరంలోని చర్చి దగ్గర జరిగిన ఈ సంఘటనపై బాధితుడి తెలిపిన వివరాలిలా..

ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరానికి చెందిన సృజన్ కుమార్ అలియాస్ చందు అదే ప్రాంతానికి చెందిన రామేశ్వరం బుజ్జమ్మ అనే మహిళ నుంచి 5 రూపాయల వడ్డీకి కొంత మొత్తం అప్పు తీసుకున్నాడు. దానికి ప్రతినెల వడ్డీ చెల్లిస్తున్నాడు.ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో మూడు నెలల నుంచి వడ్డీ చెల్లించలేకపోయాడు. దీంతో బుజ్జమ్మ పలుమార్లు అతనిని దూషించడంతోపాటు భయభ్రాంతులకు గురిచేసింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం చర్చికి వెళ్లి వస్తుండగా బుజ్జమ్మ, ఆమె కుమారుడు బెనర్జీ భర్త చెన్నయ్య సృజన్ కుమార్‌పై దౌర్జన్యానికి దిగారు. అతనిని చొక్కా పట్టుకుని తమ ఇంటికి తీసుకెళ్ళి నిర్బంధించి దాడి చేశారు. డబ్బు ఎగరగొట్టాలని చూస్తే నందం సుబ్బయ్యను చంపినట్లు చంపేస్తామని బెదిరించారని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సృజన్ కుమార్‌ను నిర్బంధించిన విషయం తెలుసుకున్న అతని తల్లి దండ్రులు బెనర్జీ ఇంటి వద్దకు చేరుకుని కుమారుడిని రక్షించుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బెనర్జీ అతని కుటుంబసభ్యులతో తమకు ప్రాణహాని ఉందని బాధితుడి తండ్రి మోషా ఆరోపించారు. కాగా, బాకీ డబ్బులు అడిగినందుకు మోషా అతని కుటుంబసభ్యులు ఇంటి వద్దకు వచ్చి తమను దూషించారని రామేశ్వరం బుజ్జమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



కడప (కల్చరల్), మార్చి 17 : కడప నగర పరిధిలోని శిల్పారామంలో ఆదివారం సందడే సందడి నెలకొంది. ఆదివారం ఆటవిడుపులో భాగంగా సాంస్కృతిక కళావేదికపై ఫస్ట్ క్రై సహకారంతో కడప నగరానికి చెందిన విజిల్ డ్యాన్స్ అకాడమీ బృందం వారిచే జానపద, సినీ నృత్య గీతాలు ప్రదర్శించారు. ముఖ్యంగా చిన్నారులు చేసిన 'జై బాలయ్య జై బాలయ్య..' అంటూ చేసిన నృత్యాలతో ప్రేక్షకుల నుంచి కరతాళ ధ్వనులు లభించాయి.

సీపీఎం నుంచి డీఎం ఓబులేసు బహిష్కరణ

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 17 : సీపీఎం నగర కమిటీ సభ్యుడిగా ఉన్న డీఎం ఓబులేసును ఆ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు నగర కార్యదర్శి రామ్మోహన్, నగర కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నిర్ణయాలను ధిక్కరించడం, క్రమశిక్షణను పాటించకపోవడం వల్ల పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

టీడీపీ వెంటే ముస్లిం మైనార్టీలు

- వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ముస్లింలు
- బీజేపీతో పొత్తుపై వైసీపీ దుష్ప్రచారం ప్రజలు నమ్మలేదు
- మీటర్లు బిగించి రైతులకు ఉరితాళ్లు బిగించేందుకు జగన్ సిద్ధమయ్యారు
- మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి



పాములూరులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి

వేంపల్లె, మార్చి 17: టీడీపీ వెంటే ముస్లిం మైనార్టీలు ఉన్నారని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెలిపారు. బీజేపీ జనసేనతో టీడీపీ పొత్తుపెట్టుకోవడం రాష్ట్ర ప్రయోజనాల కోసమే అని, కానీ ముస్లింలకు నష్టం జరుగుతుందని వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె మండలం పాములూరు గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలో ముస్లింలు చేరడమే ఇందుకు నిదర్శనమన్నారు. వేంపల్లె మండలం పాములూరు గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సమక్షంలో పలు కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మహబూబ్ బాష, హాజీబాష, బాబావలి, రఫి, షఫి, వల్లి, ఆరిఫ్, మస్తాన్‌వల్లి, శ్రీరాములు, శివ, హుస్సేన్ బాష, మహమ్మద్, మహబూబ్ బాష, శివగంగాధర్, అబ్దుల్ తదితర పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి బీటెక్ రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను ప్రజలు నమ్మడం లేదన్నారు. ఆయనకు ఇంకా ఓటు వేస్తామా అని సాధారణ ప్రజలే అంటున్నారన్నారు. సెక్రటేరియట్‌నే తాకట్టుపెట్టిన జగన్ రైతుల పాసుబుక్కులపై ఫోటోలు పెట్టుకున్నారు. వాటిని కూడా తాకట్టు పెడతారేమోనని ఆందోళన చెందుతున్నారన్నారు. వ్యవసాయ మోటార్ల వద్ద మీటర్లు బిగించేందుకు జగన్ సిద్ధమయ్యారని, అన్ని ఏర్పాట్లు చేసుకున్నారని, పొరపాటున గెలిస్తే మీటర్లు బిగించి రైతులకు ఉరితాళ్లు వేయడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి లేకపోగా వివేకా హత్యలో జగన్ హస్తం ఉందని, ఆయన సోదరిలు షర్మిల, సునీత అంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వైసీపీకి ఎలా ఓట్లు వేస్తామంటున్నారన్నారు. పొత్తుతో టీడీపీ అధికారం సాధించడం ఖాయమని బీటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మునిరెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ బాలస్వామిరెడ్డి, రైతు విభాగ రాష్ట్ర నాయకులు జగన్నాథరెడ్డి, పాములూరు చంటి, అయ్యవారిపల్లె పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో అమీర్‌బాబు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న అమీర్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 17:కడప నగరం రహ్మతీయ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో టీడీపీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్ధార్థ ఇంగ్లీషు మీడియం స్కూలులో ఘనంగా వీడ్కోలు సమావేశం



మాట్లాడుతున్న మూల మల్లిఖార్జునరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 17 :కడప నగరం మోచంపేట సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైవీయూ ప్రొఫెసరు మూల మల్లిఖార్జునరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని, అప్పుడే మెరుగైన ఫలితాలు లభిస్తాయన్నారు. పదో తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. సిద్ధార్థ స్కూలు కరస్పాండెంట్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలక్ట్రోరల్ బాండ్ల వల్ల ప్రజాస్వామ్యానికి ప్రమాదం

- అఖిల భారత అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకుడు సురేష్‌బాబు



మాట్లాడుతున్న అభ్యుదయ వేదిక నాయకుడు సురేష్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 17 : ఎలక్ట్రోరల్ బాండ్ల వల్ల ప్రజాస్వామ్యానికి ప్రమాదమని, ఈ పద్ధతి ద్వారా వందల కోట్ల రూపాయలు రాజకీయ పార్టీలు పొందడం, తదుపరి అధికారంలోకి వచ్చినప్పుడు తమకు విరాళంగా ఇచ్చిన సంస్థలకు మేలు చేయడం ఒక విధమైన క్విడ్‌ప్రోకో లాంటిదని అఖిల భారత అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకుడు సురేష్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం అభ్యుదయ వేదిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల కోట్ల రూపాయలు విరాళంగా పొందడం ద్వారా తమకు ఏర్పడిన ఆర్థిక బలంతో ఎన్నికల్లో ప్రత్యర్థులను అనైతిక పద్ధతుల్లో ఓడించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచినట్లవుతుందన్నారు. ధనబలంతో ప్రజల అభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూడడం అనైతికమన్నారు. ఎన్నికల్లో చిన్న రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు పాల్గొనడం నేటి పరిస్థితుల్లో అసాధ్యమని, ప్రజాస్వామ్యం మేడిపండు సామెతగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ధన ప్రభావం నివారణకు చేపట్టాల్సిన చర్యలపైన చర్చ జరగాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వంగాని విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి శంకరయ్య, జిల్లా నాయకులు మహబూబ్‌బాషా మాట్లాడారు. పలువురు అభ్యుదయ వేదిక సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పాలనలో దళితుల బతుకులు అంధకారం: టీడీపీ



మాట్లాడుతున్న ఆమూరి బాలదాసు

కడప (మారుతీనగర్), మార్చి 17 : జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దళితుల బతుకులు అంధకారంలో మునిగిపోయాయని టీ డీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మాసాపేటలోని టీడీపీ దళిత నాయకుడు మాసాపేట శివ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత వర్గాలకు ప్రత్యేక బడ్జెట్‌లో కేటాయించిన నిధులను నవరత్నాలకు మళ్లించి దళితుల నోట్లో జగన్‌రెడ్డి మట్టి కొట్టారని ధ్వజమెత్తారు. గత ఐదు సంవత్సరాలుగా దళితుల అభివృద్ధిలో భాగమైన విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పూర్తిగా దెబ్బతీశారన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భూమి కొనుగోలు పథకం ద్వారా రైతుల నుంచి ఎకరా భూమి 10 నుంచి 15 లక్షలకు కొనుగోలు చేసి నిరుపేద భూమిలేని దళిత రైతు కూలీలకు ఇచ్చేవారన్నారు. అంతేకాకుండా అర్హులైన దళిత నిరుద్యోగ యువతకు ట్రాక్టర్లు, ప్యాసింజరు ఆటోలు, కారు తదితర వాహనాలు పంపిణీ చేశారన్నారు. అలాగే పారిశుధ్య కార్మికులకు, స్కావెంజర్లు, చర్మకారులు, డప్పు కళాకారులకు నిధులు మంజూరు చేసే వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేశారన్నారు. సీఎం జగన్‌రెడ్డి మాత్రం ఆయా పథకాలకు మంగళం పలికి దళితులను దగా చేశారని నిప్పులు చెరిగారు. ఏమిటీ అన్యాయం అని ప్రశ్నించిన దళిత అధికారులను, మహిళలను ఇతర ప్రజా సంఘాల నాయకులను, టీడీపీ కార్యకర్తలను, నిర్దాక్షిణ్యంగా చంపించి కేసులు లేకుండా చేసిన నరరూప రాక్షసుడు జగన్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా పేదలకు 25 లక్షల హౌసింగ్ గృహాలను ప్రభుత్వమే బాధ్యతగా నిర్మించి అందిస్తామని హామీ ఇచ్చినా కేవలం 3 లక్షల గృహాలు కూడా నిర్మించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వ పాలన సాగిస్తోందన్నారు. కరెంటు బిల్లులు, ఇంటి పన్ను, చెత్త పన్ను అంటూ నానా యాగి చేస్తూ పేదల బతుకులను మరింత దుర్భరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దళితులంతా ఏకమై వైసీపీని మట్టికరిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర నాయకులు మాసాపేట శివ, డివిజన్ ఇన్‌చార్జ్ రాఘవ పాల్గొన్నారు.

జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా ఫరూక్ అహ్మద్



నియామక పత్రం అందుకుంటున్న ఫరూక్ అహ్మద్

కమలాపురం రూరల్, మార్చి 17:జిల్లా ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా ఫరూక్ అహ్మద్‌ను నియమించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయనకు జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాషా నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, కమలాపురం పట్టణానికి చెందిన ఫ రూక్ అ హ్మద్, జిల్లా టీడీపీ ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రం అందించడం జరిగిందని తెలిపారు. ఈయన టీడీపీలో క్రియాశీలక సభ్యులుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. టీడీపీని నమ్ముకున్న వారికి సముచిత స్థానం కల్పిస్తుందని తెలిపారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, కరీముల్లా (రెడ్డికరీం), 19వ వార్డు కౌన్సిలర్ అజ్మతుల్లా, టైలర్ జాఫర్‌తాజుద్దీన్, అ ఫ్రోజ్, ఖాజామొద్దీన్, యూనిట్ ఇన్‌చార్జ్ పరంధామరెడ్డి, రాష్ట్ర వాణిజ్య కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- బ్లడ్‌టు లీవ్ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్



మాట్లాడుతున్న పట్టు పోగుల పవన్‌కుమార్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 17 : ప్రతి పౌరుడు తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బ్లడ్ టు లీవ్ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఐఎంఏ హాలులో బ్లడ్ టు లీవ్ ఆధ్వర్యంలో 'నా ఓటు నా హక్కు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం చెడిపోతుందని అందరూ వ్యక్తపరుస్తున్నారన్నారు. అటువంటి సమాజాన్ని బాగు చేసే ప్రయత్నంలో భాగంగా మొదటి అడుగు వేశామని తెలిపారు. ప్రజల్లో ఓటుపై చైతన్యం తీసువకుచ్చేందుకు తమ వంతు కష్టపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు గోపి, యోగా గురువు సిద్దయ్య, సైకాలజిస్ట్ సునీత డాక్టర్ రంగనాథరెడ్డి, ఖాజీ ఖదీర్, తాజుద్దీన్, రమేష్, మద్దిలేటి, శివశంకర్‌రెడ్డి, కిష్ణతేజ, రవితేజ యాదవ్ పాల్గొన్నారు.

కత్తితో వ్యక్తిపై దాడి- ఒకరికి తీవ్ర గాయాలు

- పరారీలో నిందితుడు

కడప (క్రైం), మార్చి 17: కడప నగరం ఇక్బాల్ రైస్‌మిల్ సమీపంలో నర్సింహ అనే వ్యక్తిని ఓ యువకుడు కత్తితో పొడిచి పరారయ్యాడు. తాలూకా సీఐ తిమ్మయ్య వివరాల మేరకు... శాస్త్రినగర్‌కు చెందిన నర్సింహ పుచ్చకాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన అజీజ్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి నర్సింహను కత్తితో పొడిచి పారి పో యాడు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టామని, గాయపడ్డ నర్సింహను చికిత్స కోసం రిమ్స్‌కు తరలించామని సీఐ వివరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఘనంగా యోగి నరసింహ ఆరాధన



సీకేదిన్నె, మార్చి 17: చింతకొమ్మదిన్నె మండ లం తాడిగొట్ల పంచాయతీలోని అవధూత యోగి నరసింహ స్వామి 216వ ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆరాధన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

రాజీ మార్గంతో కేసులు పరిష్కరించుకోండి

బద్వేలు రూరల్, మార్చి 17 : లోక్ అదాలత్‌తో రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుని ప్రశాంత జీవనం సాగించాలని మండల లీగల్ సెల్ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి కోరారు. శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ క్షణికావేశానికి గురై కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని ధనాన్ని వృథా చేసుకుంటున్న కక్షిదారులందరూ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించు కోవాలన్నారు.

దేశ సమైక్యతను దెబ్బతీసే పార్టీలకు బుద్ధిచెబుదాం: సీపీఐ

కడప (నాగరాజుపేట), మార్చి 17 : 'వచ్చే ఎన్నికల్లో దేశ సమైక్యతను దెబ్బతీసే పార్టీలకు బుద్ధిచెబుదాం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ సంపదను కొల్లగొట్టే అంబానీ, ఆదాని కంపెనీలకు ఊడిగం చేస్తూ సంపద సృష్టిలో భాగస్వామ్యం అయ్యే శ్రామికవర్గాన్ని మరింత దోపిడీ చేస్తున్నారన్నారు.
సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గసభ్యుడు బి.రామయ్య, నాగసుబ్బారెడ్డి, వీరశేఖర్, వెంకటశివ, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, ఎంవీ సుబ్బారెడ్డి, విజయలక్ష్మి, వేణుగోపాల్, కేసీబాదుల్లా పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు





ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి... అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న భక్తులు

సీకేదిన్నె, మార్చి 17: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మొదటి ఆదివారం సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవారికి బోనాలు తెచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. మొదటి వారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఆరగించారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లి ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమానికి పోలీసు బందోబస్తు నిర్వహించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశారు.

మీటర్ రీడర్లకు అన్యాయం చేస్తే సహించం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 17: విద్యుత్తు మీటర్ల రీడర్లకు వేతనాలు చెల్లింపులో అన్యాయం చేస్తే సహించబోమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో విద్యుత్తు మీటర్ రీడర్ల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా మీటర్ రీడర్లకు వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. ఈసందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షులు ఓబులేసు, సుధాకర్, కిరణ్, ప్రధాన కార్యదర్శి బాలసుబ్బయ్య, సహాయ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, కార్యదర్శి సుబ్బరాయుడు, శివ, ప్రసాద్, కోశాధికారి సుబ్బారావు, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

ఎన్నికల్లో ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా

మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్



టీడీపీ మేనిఫెస్టోను మహిళలకు వివరిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం,మార్చి 17 : మైదుకూరు నియోజకవర్గంలో బి.మఠం మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని, రానున్న 2024 ఎన్నికల్లో ఆదరించాలని అభివృద్ధి ఏంటో చూపిస్తామని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ఆదివారం బ్రహ్మంగారిమఠం మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామంలో ఓసీ కాలనీ, ఎస్సీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. గడప గడపకూ తిరుగుతూ టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు తెలిపారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ రానున్న 2024 ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా ఒకసారి అవకాశం ఇవ్వాలని అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పెసల ఈశ్వర్‌రెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి, జనరల్ సెక్రటరీ ముద్దుక్రిష్ణమనాయుడు, సర్పంచ్ చిలమల నారాయణ, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మల్లోత్ర, నాగయ్య, జయరామ్ నాయుడు, లాయర్ పట్టాభి, రాఘవేంద్ర, బద్రి శివ, బాలదుగ్గిరెడ్డి, ధర్మ, వెంకటేశ్వర్లు, రమేష్, రసాయల్, భీమా నాయుడు, వెంకటేశ్ నాయుడు, భూతప్పనాయుడు, మేకల రమణయ్య, చెన్నుపల్లి జయరామరెడ్డి, బుజ్జి, వినోద్, పెరుగు నాగేంద్ర,పూజ శివయాదవ్,రమణ, నరసింహ, బాలాగౌడ్, నాగ చంద్రుడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వం వస్తే అన్న క్యాంటీన్లు మళ్లీ ఏర్పాటు చేస్తాం

టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు



మాట్లాడుతున్న సీఎం సురేశ్‌నాయుడు, ముక్తియార్

ప్రొద్దుటూరు, మార్చి 17 : టీడీపీ ప్రభుత్వం వస్తే అన్న క్యాంటీన్లు మళ్లీ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చుతామని టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం పీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో సురేశ్‌నాయుడు విలేకరులతో మాట్లాడుతూ జగన్‌ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని అన్న క్యాంటీన్‌లను మూసేయించారన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడా పెట్టని రీతిలో ప్రొద్దుటూరులో అన్న క్యాంటిన్ పెట్టి ప్రతి రోజు 5వేల మందికి ఉచితంగా భోజన సౌకర్యం కల్పించామన్నారు. దాదాపు 11 లక్షల మందికి ఈ 200 రోజులకు పైగా ఉచిత భోజనం అందిచామన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో అన్న క్యాంటీన్ మూసివేయాలని మున్సిపాలిటీ వాళ్ళు ఆదేశించారన్నారు. అందువల్ల క్యాంటీన్ మూసి వేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో టీడీపీ ప్రభుత్వం వస్తే అన్న క్యాంటీన్లు రాష్ట్ర వ్యాపితంగా తెరుచుకుంటాయన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ ముక్తియార్,టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిణామాలకు అద్దం పడుతున్న మౌమిత ఆలం కవిత్వం



మాట్లాడుతున్న మహమూద్

ప్రొద్దుటూరు/ప్రొద్దుటూరుటౌన్, మార్చి 17 : ప్రపంచంలో జరుగుతున్న అనేక రాజకీయ సామాజిక పరిణామాలను మౌమితా ఆలం కవిత్వం అద్దం పడుతుందని ప్రముఖ కవి మిత్ర జ్యోతి సాహిత్య సంస్థ కార్యదర్శి ఎస్పీ మహమూద్ కొనియాడారు. ఆదివారం స్థానిక నందిని కాంప్లెక్స్‌లోని జేవీవీ కార్యాలయంలో మౌమితా ఆలం కవిత్వం పై పరిచయ సభ జరిగింది. ఈ సభలో మహమూద్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలన్నింటిని చాలా స్పష్టమైన రాజకీయ అవగాహనతో మౌమితా ఆలం కవిత్వం రాసిదన్నారు.ఆమె ఆంగ్లంలో రాసిన కవిత్వానికి తెలుగు అనువాదం ప్రముఖ కథారచయిత కవి ఉదయమిత్ర అనువాదం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో విరసం మాజీ కార్యదర్శి వరలక్ష్మి, జేవీవీ జిల్లా అధ్యక్షుడు పోలంకి శ్రీరాములు, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ ,రచయితలు దాదాహయాత్ జింకాసుబ్రహ్మణ్యం, సురేష్, రాంగోపాల్, అక్షత, మహిత, చంద్రశేఖర్‌రావు, ప్రకాష్, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి నరసింహ ఆరాధన

సికేదిన్నె, మార్చి 17: చింత కొమ్మదిన్నె మండలం తాడిగొట్ల పంచాయతీలోని అవధూత యోగి నరసింహ స్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. వృషభరాజములచే బండ లాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

బాకీ ఇవ్వలేదంటూ దాడి

ప్రొద్దుటూరు, మార్చి 17 : బాకీ ఇవ్వలేదంటూ ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారి చల్లా శీను అను వ్యక్తి రాజబాటవీధి మహలక్ష్మీ జనరల్‌స్టోర్ యజమాని తోటంశెట్టి సురేష్‌పై దాడి చేశాడు. వివరాల్లోకి వెళితే తోటం శెట్టి సురేష్ అనే వ్యక్తి చల్లా శీను అనే ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారి వద్ద రెండేళ్ల క్రితం 21 లక్షలు అధికవడ్డీలకు అప్పుతీసుకున్నారు. దాదాపు 15లక్షలు అప్పు వడ్డీతో సహాచెల్లించారు. తక్కిన బాకీకి వడ్డీ నెలనెలా చెల్లిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేక ఒకనెల వడ్డీ చెల్లించలేదు. దీంతో సదరు ఫైనాన్స్ వ్యాపారి చల్లా శీను ఏకంగా జనరల్ స్టోర్ వద్దకు వచ్చి దాడి చేశారని శనివారం బాధితుడు సురేష్ ఆరోపిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం ఫైనాన్స్ ఆఫీసుకు రావాలని పిలిచి డబ్బులు చెల్లించపోతే చంపుతానని బెదిరించాడని తెలిపారు. ఆమేరకు ఎస్పీకి స్పందనలో ఫిర్యాదు చేశారు. కేడీపీ/ 2024/ 030341 కంప్లెట్ నెంబరు ఆధారంగా మార్చి 3 ఎస్పీ ఎండార్స్‌మెంట్ ఇచ్చినా చల్లా శీను పై కేసు నమోదు చేయలేదని సురేష్ ఆరోపిస్తున్నారు. ఎస్పీకి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోక పోవడంతో శనివారం ఉదయం తన షాపు వద్దకు వచ్చి తనను దారుణంగా బహిరంగంగా దూషిస్తూ దుకాణంలోకి వచ్చి దాడిచేశారని ఆరోపించారు. దాడిలో గాయపడిన సురేష్ జిల్లాఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు, ఈ ఘటనపై టూటౌన్‌పోలీసులు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చల్లా శీనుపై కేసు నమోదు చేశారు.

భగవద్గీత చదివితే...నిజమైన జ్ఞానం పొందవచ్చు

ఎర్రగుంట్ల, మార్చి 17: త్రైత సిద్ధాంత భగవద్గీత చదవడం ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందవచ్చునని ప్రభోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు బాలయ్యపేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఎర్రగుంట్లలో తెలుగు బుక్‌ఆఫ్‌రికార్డ్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన వంద రకాల త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ప్రచారం చేశారు. ఎర్రగుంట్ల అర్బన్ సీఐ ఈశ్వరయ్యకు గ్రంథాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో రామానంద, వీరయ్య, గోపాల్, సురేష్, భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్, గిరిధర్, రామక్రిష్ణారెడ్డి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

తెలుగు యువత ఆధ్వర్యంలో అన్నదానం

బద్వేలు, మార్చి 17: బద్వేలు పట్టణంలోని షాలోమ్ చిన్న పిల్లల అనాధాశ్రమం,ఆనందనిలయం, వృద్ధాశ్రమంలో తెలుగుయువత ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు వెంకట బ్రహ్మం, కొంకుల రవికుమార్, మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడిమెళ్ల సుదర్శన్, సింగసాని సందీప్, కుప్పాల మురళి, తుడిమెళ్ల సురేష్, పగడాల వేణు, మోడెం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టా ఎమ్మెల్యే కావాలంటూ పాదయాత్ర

మైదుకూరు, మార్చి 17 : వచ్చే ఎన్నికల్లో మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ ఎమ్మెల్యే గెలుపొందాలంటూ కౌన్సిలర్ కుర్రా రాధ, ఆ పార్టీ నాయకులు గాలి వెంకట సుబ్బయ్య, షరీఫ్, బాబురావుతో పాటు నాయకులు ఆదివారం మైదుకూరు నుంచి బ్రహ్మంగారిమఠానికి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను పుట్టా సుధాకర్‌యాదవ్ టీడీపీ జెండాను ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మల్లోత్ర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, నాయకులు ఆకుల క్రిష్ణయ్య, ధనపాల జగన్, బీఎస్ శ్రీనివాసులు, రాకెట్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌విందు

ప్రొద్దుటూరు, మార్చి 17 : మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో మదీనా మసీదు 21 వవార్షికోత్సవం సందర్భంగా ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా మసీదులో ప్రార్థనలు చేశారు. హిందూ ముస్లింలంతా విందులో పాల్గొని మత సామరస్యాన్ని చాటుకున్నారు.కార్యక్రమంలో మసీదు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు,

ఉరివేసుకుని యువకుడు మృతి

ఖాజీపేట, మార్చి 17: మండల పరిధిలోని బీసీ కాలనీకి చెందిన మోపూరి శివమోహన్ (45) అనే వ్యక్తి ఆదివారం ఉరి వేసుకుని మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే బీసీ కాలనీకి చెందిన శివమోహన్ చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఆదివారం ఇంటి వద్దకు వచ్చి తల్లితో మాట్లాడి ఆమెను బయటకు పంపి తాడుతో ఉరివేసుకుని మృతిచెందాడు. తలుపులు ఎంతకూ తీయక పోవడంతో చుట్టుపక్కలవారు వచ్చి తలుపులు పగులకొట్టేసరికే మృతిచెందాడు. బంధువులు మృతిచెందాడా లేదా అనే విషయం తెలుసుకునేందుకు 108ను పిలిపించగా మృతిచెందినట్లు వారు నిర్ధారించారు.

పుట్టా గెలుపుకోసం సైనికుల్లా పనిచేస్తాం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నేతలు

ఖాజీపేట, మార్చి 17: పుట్టా సుధాకర్‌యాదవ్ గెలుపుకోసం సైనికుల్లా పనిచేస్తామని ఖాజీపేట యువత హరి, శివారెడ్డి, సురేంద్ర అన్నారు. ఆదివారం అంబేద్కర్ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు మండల పరిధిలోని యువత ర్యాలీ నిర్వహించి అక్కడి నుంచి ప్రొద్దుటూరుకు సుధాకర్‌యాదవ్ స్వగృహానికి 40 సుమోలలో యువత బయల్దేరి వెళ్లారు. ఈ ఎన్నికల్లో పుట్టా సుధాకర్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలిచేందుకు యువత ముందుకు వచ్చిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఫరూక్, వీరయ్య, వెంకటేష్, పుల్లయ్యనాయుడు, సుబ్బయ్య, సందీప్, నాగేంద్ర, నాగేశ్వరరెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గంతో కేసులు పరిష్కరించుకోండి

బద్వేలు రూరల్, మార్చి 17 : లోక్ అదాలత్‌తో రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుని ప్రశాంత జీవనం సాగించాలని మండల లీగల్ సెల్ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి కోరారు. శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ క్షణికావేశానికి గురై కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని ధనాన్ని వృథా చేసుకుంటున్న కక్షిదారులందరూ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించు కోవాలన్నారు. లోక్ అదాలత్‌లో 62 సివిల్ కేసులు, 279 క్రిమినల్ కేసులు, 1,51,33,294 రూపాయలకు పరిష్కారం అయినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బృందాలతో ప్రత్యేక నిఘా : డీఎస్పీ



మైదుకూరు, మార్చి 17 : ఎన్నికల నోటిఫికేషన్ నిబంధనల మేరకు ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ వెంకటేశులు పేర్కొన్నారు. మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల పరిధిలోని సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, అలాగే ఆదివారం నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు 24 గంటల పాటు 3 బృందాలతో మొబైల్ టీం, అలాగే కేంద్ర బలగాలతో గట్టి నిఘా పెడతామన్నారు. అక్రమ మద్యం రవాణా, ఒక వ్యక్తి వద్ద 50 వేలు మించి నగదు ఉండరాదని, ఎక్కువగా ఉండి, తగిన ఆధారాలు లేక పోతే సీజ్ చేస్తామన్నారు. అలాగే భారీ సంఖ్యలో వస్తువులున్నా , నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలుంటాయన్నారు. 24 గంటల పాటు తనిఖీలు చేస్తామని తెలిపారు. ఎన్నికల నియమావళిని అనుసరించి రాజకీయ పార్టీల నాయకులు నడుచుకోవాలని తెలిపారు. అలాగే ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే వారిపై కఠిన చర్యలుంటాయని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

టీడీపీవి పూర్ టు రిచ్ సూపర్‌సిక్స్ పథకాలు

- చిన్నదండ్లూరులో భూపేష్ తల్లి సరస్వతి, భార్య జ్యోతి ప్రచారం



చిన్నదండ్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, మార్చి 17: రాబోయే ఎన్నికల్లో టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలు పూర్ టు రిచ్ అయ్యేవిగా ఉన్నాయని నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తల్లి సరస్వతి, భార్య జ్యోతి ప్రజలను కోరారు. ఆదివారం ఎర్రగుంట్ల మండలంలోని చిన్న దండ్లూరులో వారు బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లపురెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రాముడు, గోపాల్, గోపాల్,పవన్, రామాంజనేయులు, నాగేశ్వర్‌రెడ్డి, వెంకట రామిరెడ్డి, మునీంద్ర, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ మొదలైంది



వైఎస్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

పోరుమామిళ్ల, మార్చి 17 : ఎన్నికల నగారా మోగడంతో పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లో రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను జెండాలను తొలగించారు. ఆదివారం రంగసముద్రం పంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. రోడ్డుకిరువైపులా ఉన్న ఫ్లెక్సీలను, పార్టీల జెండాలను తొలగించారు. పోరుమామిళ్లలో కూడా రాజకీయ పార్టీల జెండాలను ఫ్లెక్సీలను తొలగించి వైఎస్ విగ్రహానికి ముసుగు వేశారు. కానీ పోరుమామిళ్ల 1వ సచివాలయం వద్ద వైసీపీకి చెందిన జెండాను తొలగించారు. కానీ ఆ జెండాకు ఏర్పాటు చేసిన స్తంభాన్ని మాత్రం సాయంత్రం వరకు తొలగించలేదు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఎర్రగుంట్లలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

కొండాపురం, మార్చి 17: మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు ఓబులేసు, రామయ్య తెలిపారు. మండలంలో మొత్తం మూడు పరీక్ష కేంద్రాలలో 485 మంది పరీక్షలు రాయనున్నటు వారు తెలిపారు.కొండాపురం జడ్పీహైస్కూల్‌లో 160 మంది, గురుకుల పాఠశాలలో 180 మంది,శివసాయి హైస్కూల్‌లో 145 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు బెంచ్‌లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.ఉదయం 8-30 నుంచి మధ్యాహ్నం 12-45 వరకు విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్ల మండలంలో పదోతరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం వివిధ పరీక్ష కేంద్రాల్లో వసతులను ఎంఈవో శివప్రసాద్ పరిశీలించారు. ఎర్రగుంట్లలో బాలుర, బాలికల, రాణీవనంలోని హైస్కూల్, సెయింట్ థామస్, చిలమకూరులోని హైస్కూల్‌లో పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో నీటి వసతి, డెస్కులు, లైటింగ్ ఏర్పాట్లు పూర్తిచేశారు. అలాగే ప్రతి కేంద్రంలో 10మందికి తగ్గకుండా ఇన్విజిలేటర్స్, ఒక సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుందని ఎంఈవో తెలిపారు.

మైదుకూరు..: మైదుకూరులో సోమవారం నుంచి 7 కేంద్రాలల్లో 10వ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని జడ్పీ బాలుర, జడ్పీ బాలికల, ఉర్దూ పాఠశాలలోనూ, శ్రీవేదవ్యాస, సెయింట్ జోసఫ్, వాసవీ హైస్కూల్,వీఆర్ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా మొత్తం 1260 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 64 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు మండల విద్యాశాఖాధికారి పద్మలత పేర్కొన్నారు.